■ శేఖర్ ఇంటికొచ్చేసరికి ఇంట్లోంచి ఏడ్పులు, దెబ్బలు కలగాపులగంగా వినిపించాయి. కంగారుగా లోపలికి అడుగుపెట్టాడు. తల్లిశాంతమ్మ అతని చెల్లి సరోజని ఆ చెంపా ఈ చంపా ఎడాపెడా వాయిస్తోంది. ఆయాసంతో అరుస్తోంది. "నా కడుపున చెడపుట్టావుగదే. ఎవడే వాడు చెప్పు చెప్పు" అంటూ అరిచినదల్లా "చెప్పవే" అంటూ ఒక్కసారిగా ఏడ్చేసింది. సరోజ ఏడుస్తూ "అమ్మా నేను ఏ తప్పూ చేయలేదమ్మా! అతనే రోజూ "మిమ్మల్ని ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను అని వెంటపడుతుంటే నాతో కాదు మా ఇంట్లో వాళ్ళతో చెప్పండి అని చెప్పాను. అదే సమయానికి నువ్వు అటువచ్చి మమ్మల్ని చూశావు. నేను అతనితో మాట్లాడింది ఆ ఒక్కమాటేనమ్మా! నేను చేసింది తప్పే అయితే నన్ను కొట్టు. చంపు. చంపమ్మా?" అని ఏడుస్తూ శాంతమ్మ చేతులతో తన చెంపలను వాయించేసుకుంది సరోజ. "సరోజా! నన్ను క్షమించవే. నిన్ను అపార్థం చేసుకున్నానే తల్లీ! నిన్ను కొట్టిన ఈ చేతులు... ఈ చేతులు" అంటూ చేతులకేసి చూసుకుని "ఇక ఉండకూడదు" అంటూ చేతుల్ని గోడకేసి బాదుకుంటూ హృదయవిదారకంగా ఏడుస్తోంది శాంతమ్మ. గుమ్మంలో నిల్చుని ఇదంతా చూస్తున్న శేఖర్ గుండె ఆర్ద్రతతో నిండిపోగా "అమ్మా!" అని తల్లిని ఆపాడు. "అమ్మా! ఇదంతా నా

# కన్నీరు + క్షమ = ఆనందభాష్పాలు

అసమర్థత అమ్మా! వయసొచ్చిన చెల్లిని ఇంట్లో పెట్టుకుని దానికి పెళ్ళిచేయాలన్న జ్ఞానం కూడా లేకుండా



తిరుగుతున్న నన్ను కొట్టాలమ్మా! ఆ గోడను కాదు. నన్ను కొట్టు" అని ఏడుస్తూ శాంతమ్మ చేతులను అందుకుని చెంపలను వాయించుకోబోయాడు. కాని అతని చేతులు శాంతమ్మ చేతులను తాకకముందే అతని చెంప వాచిపోయింది. ఒక్కక్షణం నిశ్శబ్దం కూడా నిశ్శబ్దంగా ఏడ్చింది. శేఖర్ ఏడుపు ఆపి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసుకుని చూశాడు. శాంతమ్మ కోపంగా చూస్తూ "ఇప్పుడు చేయాల్సింది ఏడుస్తూ కూచోటం కాదు. వెళ్ళు. వెళ్ళి అతని తల్లిదండ్రులతో మాట్లాడిరా" అంది.

శేఖర్ దుఃఖాన్ని గొంతులో దిగమింగుకుని తలవంచుకుని గుమ్మం దాటబోయేసరికి అతని కాళ్ళకు అడ్డుగా ఏదో పడింది. ఉలిక్కిపడి వెనక్కి జరిగాడు. సరోజ అతని కాళ్ళకు చుట్టుకుపోయి "నన్ను క్షమించన్నయ్యా! ఎన్నడూ అమ్మచేత చిన్నదెబ్బకూడా తిని ఎరగని నువ్వు ఈ రోజు నా మూలంగా చెంపదెబ్బ తినాల్సి వచ్చింది. నన్ను మన్నించన్నయ్యా! అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది... వెనకనుండి శాంతమ్మ ఎంతోసేపటినుండి ఏడుపు ఆపుకున్నట్లుగా ఒక్కసారి భోరుమంటూ ఏడ్చేసింది. "నన్ను క్షమించరా శేఖరం! కోపంలో నీ మీద చేయిచేసుకున్నాను" అంది అతని చేయి పట్టుకుని ఏడుస్తూ. శేఖర్ "అమ్మా! ఛ ఛ ఏడుస్తున్నావా! పెళ్ళివారింటికి వెళ్తుంటే ఏడుస్తూ పంపిస్తారా ఎవరయినా? నవ్వుతూ సాగనంపమ్మా. ఏది చెల్లెమ్మా నువ్వు కూడా! ఆ...ఆ అదీ!" అని వాళ్ళ కళ్ళు వాళ్ళు కట్టుకున్న చీరలతో తుడవబోయాడు. కానీ అవి అప్పటికేకన్నీటితో తడిసిపోయి ఉండటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని వారికి వీడ్కోలు ఇచ్చి పెళ్ళివారింటికి బయలుదేరాడు. శాంతమ్మ, సరోజ కళ్ళవెంబడి నీళ్ళు కారుస్తూ చేతులు ఊపుతున్నారు. ఈసారి వాళ్ళ కళ్ళనుండి కారేవి కన్నీళ్ళు కావు, ఆనందభాష్పాలు.

—దేవినేని రాజా

(గుంటూరు) ✱



ముగ్గు: వి.వసంత కాకాగూడ (సికిందరాబాద్)


